# దీపాన్ని చూస్తున్నా

నీలంగా బయలుదేరి. . పసుపుగా ఉబ్బి. . నల్లగా కొనదేలి

కదులుతున్న దీపాన్నిచూస్తున్నా

ఏదో గొణగి సణగి బరబరా టప్ మని ఆరిపోయిన దీపాన్ని చూస్తున్నా

ఉఫ్ మని ఊదినా ఆరిపోక పెద్దపులి పసుపుతో మొహంమీదికొచ్చే

దీపాన్ని చూస్తున్నా. .

సన్నటి దీపాన్ని

వత్తిలో ఇరుక్కున్న. . ఎర్రటిరవ్వల్లో. . దూరిపోతున్న. . దీపాన్నిచూస్తున్నా. .

గాలికి ఊగిపోతూ. . నీడల్ని వెదుక్కుంటున్న దీపాన్ని చూస్తున్నా. .

భయాన్ని దాచుకొంటూ. . ఆందోళనగా. . తలతిప్పుతూ వెలుగుతున్న

దీపాన్ని చూస్తున్నా. .

ఒకే దీపాన్ని

ఆశలా మిణుకుమిణుకుమంటూ. . ఆరిపోతున్న రాత్రిని

వెలిగించచూస్తున్న దీపాన్ని

నిలకడగా. . నిశ్చలంగా. . నూనెతాగేస్తూ బ్రేవుమని తేన్చుతున్న దీపాన్ని

చేతులులేని దీపాన్ని. . సైగలుచేస్తున్న దీపాన్ని. .

సముద్రాన్ని ఈదాలని సమాయత్తమవుతున్న దీపాన్ని..

దీపాన్ని

నేను  దీపాన్ని చూస్తున్నా.

03.12.90